ప్రజాశక్తి
మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | 5 | కర్నూలు

సంస్మరణ సభలో మాట్లాడుతున్న గౌస్‌దేశాయ్

'జనరిక్'పై అవగాహనేది..?

• సామాన్యుల ఔషధానికి తగ్గిన గిరాకీ • బ్రాండెడ్ మందులవైపే మొగ్గు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

అనేక రోగాలకు చికిత్సలతో పాటు వాటికి అవసరమయ్యే మందులు కూడా ఖరీదయ్యాయి. పేదలు, సామాన్యులు అనారోగ్యం పాలైతే వైద్య ఖర్చులకు లక్షల్లో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీర్ఘకాలిక వ్యాధులైన బిపి, షుగర్, గుండె జబ్బులు వంటి రోగాలకు నిత్యం రూ.వేలల్లోనే మెడిసిన్స్‌కు ఖర్చు పెట్టే పరిస్థితి ఉంది. ప్రజల్లో వైద్య ఖర్చులు తగ్గించుకోవడం కోసం అనేక జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేస్తున్నామన్న ప్రభుత్వ ప్రచారం ఆచరణలో అమలు కావడం లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 30 దాకా జనరిక్ మందుల షాపులు ఉన్నాయి. జనరిక్ మందులు అంటే ఇవి తక్కువ ఖరీదుతో కూడుకున్నవి ఇవి పనికిరానివి అనే అపోహ చాలా మందిలో ఉంది. ప్రజలకు తక్కువ ఖరీదుకే లభించే జనరిక్ మందులను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు మందుల ఆర్థిక భారాల నుంచి కాపాడాల్సిన ప్రభుత్వం తూతూ మంత్రంగా ప్రచారం నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటుందనే ఆరోపణలు వున్నాయి.

జనరిక్ మందులకు బ్రాండెడ్ మందులకు తేడా లేదు

కొన్ని పెద్ద ఫార్మా కంపెనీలు వివిధ రోగాలకు పరిశోధన చేసి పరీక్షించి కొత్త మందులను మార్కెట్లోకి అందుబాటులోకి తెస్తాయి. ఆ మందు పైన పేటెంట్ హక్కు ఆ ఫార్మా కంపెనీకి 20 సంవత్సరాల పాటు ఉంటుంది. పేటెంట్ హక్కు ముగిసిన తర్వాత అదే ఫార్ములాను ఉపయోగించి తక్కువ ఖరీదుతో మందులను అనేక కంపెనీలు అందుబాటులోకి తెస్తాయి. వాటిని జనరిక్ మందులు అంటారు. ఈ జనరిక్ మందులు తక్కువ ఖరీదుకే ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. తక్కువ ధరలో లభిస్తున్న జనరిక్ మందులు మనదేశంలో ప్రతి ఏటా వేల కోట్ల మెడికల్ బిజినెస్ జరుగుతోంది. రూపాయి డ్రగ్‌ని పది రూపాయలకు విక్రయిస్తున్నా ప్రశ్నించలేని పరిస్థితి వుంది. మెడికల్ మాఫియాను ఆటకట్టించడానికి జనరిక్ మెడిషన్ వచ్చినా సరైన ఆదరణలేదు. జనరిక్ వచ్చి 20 ఏళ్ల అవుతున్నా 20శాతం మంది ప్రజలు కూడా జనరిక్ మెడికల్ షాపులకు వెళ్లడం లేదంటే జనరిక్ మెడిషన్ పట్ల ప్రజలకి అవహగానలోపం ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కానీ వీటికి సరైన ప్రాధాన్యత, ప్రచారం లేకపోవడంతో ప్రజలు పెద్దకంపెనీల మందులవైపు మొగ్గు చూపుతున్నారనే ఆరోపణలు వన్నాయి. మెడికల్ కౌన్సిల్ నిబంధన మేరకు వైద్యులు తమ చీటిపై పెద్ద అక్షరాలతో తప్పనిసరిగా మందు పేరునే రాయాలని డాక్టర్లకు ప్రభుత్వాల నుంచి ఆదేశాలు ఉన్న ఎక్కువ డాక్టర్లు వాటిని మాత్రం పట్టించుకోవడం లేదని ఫార్మా కంపెనీ ఆఫర్లకు లొంగి వేల రూపాయలు విలువ చేసే బ్రాండెడ్ మందులనే రాస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. జనరిక్ మందులను తయారు చేయటానికి పరిశోధనలు, క్లినికల్ ట్రయల్స్ జరపవలసిన అవసరం లేదు కాబట్టి జనరిక్ మందుల ధరలు, బ్రాండెడ్ మందుల ధరలతో పోలిస్తే 30 నుండి 80 శాతం తక్కువ ధరలలో లభిస్తాయి. జనరక్ మందులపై ముద్రించబడే ఎంఆర్‌పి కంటే చాలా తక్కువ రేటుకే అందుబాటులో ఉంటాయి.

ఒక టాబ్లెట్‌పై వ్యత్యాసం ఇలా ఉంది

- అమ్లోడిపిన్ 5ఎంజి టాబ్ జనరిక్ –రూ.0.55, బ్రాండెడ్ – రూ.2.72,
- పంటప్రాజోలు 40ఎంజి టాబ్ జనరిక్ – రూ.1.3 బ్రాండెడ్ – రూ.12.00 ,
- రాబిప్రొజోల్ డిఎస్ఆర్ –జనరిక్ – రూ.2.00, బ్రాండెడ్ – రూ.13.00 ,
- టెల్మిసార్టన్‌హెచ్ జనరిక్ –రూ.2.35 అయితే బ్రాండెడ్ రూ.12.00 ఉంటుంది.
- గ్లీమిపిర్డె టాబ్ జనరిక్ – రూ.0.84 కాగా బ్రాండెడ్ రూ.4.1,
- టెర్లిప్రెస్సిన్ ఇంజెక్షన్ జనరిక్ – రూ.357లు అయితే బ్రాండెడ్ రూ.2500

నిజానికి జనరిక్ మెడికల్ షాపులలో ఒకటి, రెండు రోజుల్లో వాడే మందులు బ్రాండెడ్‌తో కొన్నా పర్వాలేదు కాని నెలల తరబడి మందులు వాడే బిపి, షుగర్, కార్డియాలజి రోగులు మాత్రం జనరిక్ కొనడమే ఉత్తమమని అంటున్నారు. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరికి వైద్యం, మందులకు అయ్యే ఖర్చు నెలకి వేలల్లో ఉంటుంది. అది వీరికి భరించలేని భారంగా ఉంటుందని, వీరు జనరిక్ మందులపై దృష్టి పెడితే మందుల కోసం చేసే ఖర్చు చాలా వరకు తగ్గుతుందని అంటున్నారు.

జనరిక్ మెడిషన్స్ బాగా పని చేస్తాయి

- ఎటివి. రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ, కర్నూలు

జనరిక్ మెడిసిన్స్‌పై ప్రజల్లో అపోహలు ఉన్నాయి. బ్రాండెడ్ మెడిసిన్స్ బాగా పనిచేస్తాయి. జనరిక్ మెడిసిన్స్ పనిచేయవు అన్న అపోహలు ప్రజల్లో ఉన్నాయి. జనరిక్ అయినా బ్రాండెడ్ అయినా ఒకటే మందే. జనరిక్ తక్కువ రేటు కాబట్టి ఇది పని చేయవేమో అన్నది కరెక్ట్ కాదు. జనరిక్ మందులకు పేటెంట్ హక్కు ఉండదు కాబట్టి తక్కువ రేటుకే లభిస్తాయి. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మా డిపార్టుమెంట్ పరంగా హాస్పిటల్స్ దగ్గర, మెడికల్ షాప్‌ల దగ్గర పోస్టర్స్ ద్వారా కొన్ని సందర్భాల్లో స్టాల్స్ ఏర్పాటు చేస్తూ అవగాహన కల్పిస్తున్నాం.

బీపీ, షుగర్ మందులు వాడుతున్నా..

- సత్యనారాయణ, రిటైర్డ్ ఎంప్లాయ్, కర్నూలు

నేను గత పది సంవత్సరాలుగా బిపి, షుగర్‌కు ఈ జనరిక్ మందులనే వాడుతున్నాను. గతంలో ఇహెచ్‌ఎస్‌లో ఉచితంగా తీసుకునేవాడిని అవి ఆగిపోయిన తర్వాత ఇక్కడ తీసుకుంటున్నాను. ఇవి చాలా తక్కువ ఖరీదు బాగానే పని చేస్తున్నాయి.

బ్రెయిన్‌స్ట్రోక్‌కు మందులు వాడుతున్నా

- మోహన్, కర్నూలు



నేను గత సంవత్సర కాలంగా బ్రెయిన్ స్ట్రోక్‌కు మందులు వాడుతున్నాను. జనరిక్ మందులు తక్కువ ధరకు దొరుకుతాయని ఇక్కడ తీసుకుంటున్నాను.

ప్రజాసేవకు రాజగోపాల్ అంకితం

- సంస్మరణ సభలో డి.గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం, కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడు రాజగోపాల్ తన జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసిన గొప్ప నాయకుడని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ కొనియాడారు. సోమవారం కర్నూలు నగరంలోని పాతబస్తీలోని హరికిషన్‌సింగ్ సూర్జిత్ భవన్‌లో కె.రాజగోపాల్ సంస్మరణ సభ సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ మాట్లాడుతూ కె.రాజగోపాల్ మొట్టమొదట తన ఉద్యమం పేపర్ మిల్లు లో సాధారణ కార్మికుడిగా ప్రారంభమై, ప్రజానాట్యమండలి జిల్లా తొలి అధ్యక్షుడిగా చరిత్రకెక్కారన్నారు. కె.రాజగోపాల్, మల్లికార్జున, కె.రవి, ఎంపి బసవరాజ్ కలసి అనేక కళారూపాలను ,నాటకాలను వేసి ప్రజలను చైతన్య పరచేవారని చెప్పారు. అనంతరం సిఐటియులో కార్మిక నేతగా పేపర్ మిల్లు సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడారని తెలిపారు. సిపిఎం నాయకుడిగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, పని చేశారని అన్నారు. 1995లో బండిమెట్టలో తొలి సిపిఎం కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలిచారని, కార్పొరేషన్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వాణిని ప్రజా గళాన్ని వినిపించారన్నారు. బండి మెట్టలో అనేక సమస్యలు పరిష్కారం చేశారని, అటువంటి నాయకుడు మన మధ్య భౌతికంగా లేకపోయినా ఆయన ఆశయాల సాధన కోసంమనం కృషి చేసినప్పుడే ఆయనకు మనం నిజమైన నివాళి అర్పించిన వాళ్ళమవుతామన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నిర్మల మాట్లాడుతూ పేపర్ మిల్లు ఉద్యమంలో మొదటి తరం నాయకులు అయిన టి.షద్రక్, కె.రాజేశ్వర్‌రెడ్డి, చెన్నారెడ్డి తదితర సహచరుల అనంతరం రాజగోపాల్ , బసవయ్య, కెవి సుబ్బయ్య ,జి.సుబ్బయ్య లాంటి ఆణిముత్యాలను పేపర్‌మిల్ ఉద్యమం అందిచ్చిందన్నారు. ఆ పేపర్ మిల్ పోరాటాల ఫలితమే ఈరోజు సిపిఎం ఇంత విస్తారంగా, బలమైన పార్టీగా నిర్మితమవ్వడానికి టి. నరసింహయ్య ,షద్రక్, గఫూర్‌లతో పాటు పేపర్ మిల్ ఉద్యమాన్ని మర్చిపోలేమని చెప్పారు. అటువంటి పేపర్ మిల్లు కార్మికుడైన రాజగోపాల్ ఒకరు కావడం గర్వించదగ్గ విషయం అన్నారు. ఆయన లేకపోవడం మన పార్టీ ఉద్యమానికే కాక, కార్మిక ,పేద బడుగు, బలహీన వర్గాల వారికి కూడా తీరని లోటని అన్నారు. ఈ లోటును రాబోయే తరం మనమందరం నాయకత్వాన్ని తీసుకొని రాజగోపాల్ ఆశయాల సాధన కోసం కృషి చేయాలని అన్నారు. ఆయన సహచరులు ఎంపి. బసవరాజు, ఆంజనేయులు (అంజన్న) లు ఆయనతో తమకున్న అనుబంధాన్ని తెలిపారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి.రాముడు మాట్లాడారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, ఓల్డ్ సిటీ, న్యూ సిటీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు, పార్టీ నగర కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు ,పార్టీ సభ్యులు ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు, రాజగోపాల్ అభిమానులు, సానుభూతి పరులు వారి కుటుంబ సభ్యులు లక్ష్మీవారి అబ్బాయి రవికుమార్, ప్రజానాట్యమండలి నుంచి రాజు, లోకేష్, రాంబాబు, నాగస్వాములు, సుబ్బారాయుడు, సుంకన్న, బతుకన్న, సరిత, నోమేశ్వరీ రాజగోపాల్‌పై విప్లవ గీతాలు ఆలపించారు. పార్వతయ్య పద్యాలు వినిపించారు. న్యూ సిటీ, ఓల్డ్ సిటీ నాయకులు పాల్గొన్నారు.

గ్రేడ్-3 ఎఎన్‌ఎం పోస్టుల భర్తీ చేయాలి

- కలెక్టరేట్ ఎదుట హెల్త్ సెక్రెటరీలు ధర్నా

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

సచివాలయంలో పనిచేస్తున్న హెల్త్ సెక్రెటరీలకు ప్రమోషన్ ఇస్తూ ఎఎన్‌ఎం గ్రేడ్3 పోస్టులను భర్తీ చేయాలని గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల రాష్ట్ర కార్యదర్శి సంధ్యారాణి సిఐటియు కర్నూలు, నంద్యాల జిల్లా కార్యదర్శులు ఎండి.అంజిబాబు, నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట వార్డు హెల్త్ సెక్రటరీలు ధర్నా చేశారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. జెసి స్పందిస్తూ వెంటనే జరిగేటట్లు చూస్తామని హామీ ఇచ్చారు. డిఎంహెచ్‌ఒకు పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలని జెసి ఆదేశించారు. అంతకు ముందు జరిగిన ధర్నాలో వారు మాట్లాడుతూ సచివాలయంలో పని చేస్తున్న హెల్త్ సెక్రటరీల ను ప్రమోషన్ ఇస్తూ గ్రేడు 3 ఎఎన్‌ఎం పోస్టు భర్తీ చేయడానికి సర్క్యులర్ జారీ చేశారన్నారు. ఇప్పటికే కడప జిల్లాలో ఫిబ్రవరి 12న ప్రమోషన్లు కూడా ఇచ్చారని, కాని కర్నూలు జిల్లాలో ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టకపోవడం వల్ల హెల్త్ సెక్రటరీస్ ఆందోళనకు గురవుతున్నారన్నారు. వెంటనే ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టాలన్నారు. మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్‌లో ఇచ్చే సమయంలో వారికి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. వెంటనే వారికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. హెల్త్ సెక్రటరీస్ జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, నంద్యాల జిల్లా నాయకురాలు వెంకటేశ్వరమ్మ, సుధారాణి, కర్నూలు జిల్లా నాయకురాలు సుగుణమ్మ, 30 మంది వరకు హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ధర్నా చేపడుతున్న వార్డు హెల్త్ సెక్రటరీలు

గ్రీవెన్స్ పరిష్కారంపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రజల నుండి వచ్చిన గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని జిల్లా కలెక్టర్ పి రంజిత్‌బాష ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ద్వారా ప్రజల నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వినతులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని పలు మార్లు చెప్పినప్పటికీ కూడా ఇంకా ఎట్ టూ వ్యూలో చూడని అర్జీల కేసుల సంఖ్య ఉండడం ఏంటని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వారాలు అవుతున్నప్పటికీ ఇంకా వాటిని చూడకపోవడం ఏంటని, ఇంత నిర్లక్ష్య ధోరణితో ఉండడం ఏంటని , ఈ విధంగా ఉంటే బాధ్యతతో విధులు ఎలా నిర్వహిస్తారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తహశీల్దార్ దేవనకొండ కు 7 అర్జీలు వచ్చి 14 రోజులు అవుతున్నాయని, జిల్లా మైనారిటీ అధికారి కర్నూలుకు 3 అర్జీలు వచ్చి 7 రోజులు అవుతున్నాయని, తహశీల్దార్, హోళగుందకు 2 అర్జీలు వచ్చి 13 రోజులు అవుతున్నాయని, తహశీల్దార్, కల్లూరుకు 2 అర్జీలు వచ్చి 15 రోజులు అవుతున్నాయన్నారు. ఉద్యాన శాఖ అధికారి, పత్తికొండకు 1 అర్జీ వచ్చి 14 రోజులు అవుతున్నాయని , మండల విద్యాశాఖ అధికారి, ఎమ్మిగనూరుకు 1 అర్జీ వచ్చి 14 రోజులు అవుతున్నాయన్నారు. వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆదోనికి 1 అర్జీ వచ్చి 7 రోజులు అవుతున్నప్పటికీ కనీసం అర్జీలు వచ్చి 15 రోజులు అవుతున్నా వాటిని చూసే దానికి కూడా సమయం లేదా అని కలెక్టర్ ప్రశ్నించారు. సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ డిఆర్‌ఒను ఆదేశించారు. అదే విధంగా ఎవరైనా అధికారుల పేర్లు 3 సార్లకు మించి ఎట్ టూ వ్యూ కేసులలో వస్తే సంబంధిత వారికి ఛార్జ్ మెమోలు జారీ చేయాలని కలెక్టర్ డిఆర్‌ఒను ఆదేశించారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్.బినవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఒ సి.వెంకటనారాయణమ్మ ,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, జెసి డాక్టర్ నవ్య

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాష

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇసుక అక్రమ రవాణా చేసే వారి మీద కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష తెలిపారు. సోమవారం సాయంకాలం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ లెవెల్ శాండ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత ఇసుకను సాధారణ ప్రజల గృహ నిర్మాణాల అవసరాలకు అనుమతి ఇవ్వాలని, వారిని ఎటువంటి ఇబ్బందులకు గురి చేయకూడదని ఆదేశించారు. అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లాలో ఎవరైనా అక్రమంగా ఇసుకను సేకరించుకొని వ్యాపారం చేస్తున్న , సరిహద్దులు దాటిస్తున్న వారి వాహనాలను వెంటనే సీజ్ చేయాలన్నారు. మండల , గ్రామ సెక్రటేరియట్ అధికారులతో ఏర్పాటు చేసిన టీంల సహాయంతో మెరుపు దాడులు నిర్వహించి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. డివిజన్ స్థాయి సమావేశాలను నిర్వహించుకొని ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరుగుతూ ఉంటే కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు ఆర్‌డిఒలను ఆదేశించారు. నదులు, వాగులు దగ్గర ఉన్న తాగునీటి సరఫరా కేంద్ర ప్రాంతాలలో ఇసుక త్రవ్వకాలకు ఎటువంటి పరిస్థితుల్లో అనుమతించరాదన్నారు. అటువంటి ప్రదేశాల్లో ఇసుక త్రవ్వకాలు జరుగుతూ ఉంటే వాహనాలను సీజ్ చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య , అడిషనల్ ఎస్‌పి హుస్సేన్ పీరా , డిఎస్‌పి రవీంద్రబాబు , డిఎస్‌పి ఉష శ్రీ , డిడి మైన్స్ రవిచంద్ర , ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ నాగేశ్వరరావు , డిటిసి శాంత కుమారి , డిపిఒ భాస్కర్ , ఇరిగేషన్ ఇఇ శైలేశ్వర్, గ్రౌండ్ వాటర్ డిడి శ్రీనివాసరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ రెడ్డి , కర్నూలు తాలూకా సిఐ , కోడుమూరు సిఐ, తదితరులు, సబ్ కలెక్టర్ ఆదోని , ఆర్డిఒ లు పత్తికొండ , కర్నూలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

బైక్‌కు నిప్పు పెట్టిన దుండగులు

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలో ఈర్లదిన్నెలో కురువ రామాంజనేయులు కు చెందిన పాషన్ ప్రో బైక్‌కు గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి దాటాక నిప్పు పెట్టారు. బాధితుడి నుండి ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ తిమ్మారెడ్డి పోలీస్ సిబ్బంది కృష్ణ, భాస్కర్ చేత సంఘటన స్థలంలో విచారణ చేయించారు. గుర్తు తెలియని వ్యక్తులా లేక సొంత వారే నిప్పు పెట్టారా అన్న కోణంలో విచారించి పంచనామా చేశారు. అక్కడే సిసి నిఘా కేంద్రాలను పరిశీలించి త్వరలో సంఘటనకు సంబందించిన వివరాలు వెల్లడి అవుతాయాన్నారు.

అసెంబ్లీని ముట్టడిస్తాం

సివిల్‌సప్లయ్ హమాలీల నాలుగోరోజు నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సివిల్ సప్లయ్ హమాలీలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం కొత్త కూలిరేట్ల జిఒ విడుదల చేసే వరకు పోరాటం చేయాలని సోమవారం నాలుగో రోజు ఎంఎల్ఎస్ పాయింట్ల దగ్గర నిరసన తెలిపారు. కర్నూలు నగరంలోని ఎ క్యాంపు దగ్గర ఉండే సివిల్ సప్లయ్ ఎంఎల్ఎస్ పాయింటు దగ్గర సోల్మాన్ రాజు అధ్యక్షతన నిర్వహించిన నిరసనను ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి.గౌస్ దేశాయ్, రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ మాట్లాడారు. హమాలీల కూలిరేట్లను పెంచుతూ కొత్త కూలిరేట్లకు సంబంధించిన జీవోను వెంటనే విడుదల చేయాలని లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అగ్రిమెంట్ ముగిసి 14 నెలలు అవుతున్నా వారికి పెరిగిన ధరలకు కనుగుణంగా జిఒను విడుదల చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. రెండు సంవత్సరాలకోసారి అగ్రిమెంటు ప్రకారం కూలిరేట్లు పెరిగినా కూడా నామినల్‌గా పెంచుతున్నారన్నారు. రూ.3 నుండి రూ.5 వరకు మాత్రమే పెంచుతున్నారన్నారు. ఇది కార్మికులకు సరిపోవడం లేదని, ఇప్పుడు ఉన్నటువంటి రేట్ల ప్రకారం చూసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లయ్ హమాలీలకు రూ.30 నుండి రూ.40 వరకు పెంచి ఇస్తే తప్ప వారి జీవనం సాగదని అన్నారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందుతుందన్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం పెంచిన కూలి రేట్లు రూ.25 నుండి రూ.28 సంబంధించిన జిఒను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ హమాలీలు రాష్ట్ర ప్రభుత్వానికి ఎనలేని సేవచేస్తున్నారని ప్రజలకు నిత్యవసర వస్తువులను చేరవేసే దాంట్లో వారి పాత్ర ముఖ్యమైందన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే హమాలీల పట్ల నిర్లక్ష్యం తగదని అన్నారు. సివిల్ సప్లయ్ హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. బోనస్ స్వీట్స్, డ్రస్సు కుట్టుకూలీతో పాటు పెంచి ఇవ్వాలని, పెరుగున ధరలకు అనుగుణంగా కూలీల రేట్లతో పాటు 14 నెలలకు సంబంధించిన అరియర్స్ కూడా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. హమాలీల సమస్యలను పరిష్కరించకపోతే ప్రస్తుతం జరగనున్న అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి బజారి,కర్నూలు ఎంఎల్ఎస్ పాయింట్ యూనియన్ సెక్రటరీ సోలమన్ రాజు, శివ, వినయ్, ప్రకాష్, రమేష్, శ్రీను, ఎం రాజు, వెంకటేష్ బాలరాజు, మహేంద్ర, డి.సూరి, మద్దిలేటి, సుధాకర్, బి.దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

సివిల్‌సప్లయ్ హమాలీల నిరసను ఉద్దేశించి మాట్లాడుతున్న డి.గౌస్ దేశాయి

పత్తి కొనుగోలు కేంద్రాలు పునః ప్రారంభించాలి

కలెక్టర్‌కు ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పత్తి పంట కొనుగోలు కేంద్రాలను పునఃప్రారంభించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. క్వింటాలుకు రూ.పదివేలకు తక్కువ కాకుండా రైతులకు ఇవ్వాలన్నారు. సోమవారం ప్రజా దర్బారులో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషను రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ, గూడూరు మండలం అధ్యక్షులు కృష్ణారెడ్డి వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు. జి.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకుపైగా పత్తిపంట సాగుఅయిందని, దిగుబడి కూడా ఈ సంవత్సరం కొంత మెరుగైందన్నారు. ఎనిమిది క్వింటాళ్ల నుండి 12, 13 ,14 క్వింటాళ్లు ఎకరాకు దిగుబడి వచ్చిందన్నారు. దిగుబడి వచ్చినప్పటికీ ధర లేకపోవడం వలన రైతులు పెట్టిన పెట్టుబడి రాక అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఖరీఫ్‌లో పండిన పంట నవంబర్ మాసం వరకు పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు మండలాలలో సుమారుగా 12 కేంద్రాలలో ఏర్పాటుచేసి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా రైతుల నుండి పత్తి కొనుగోలు చేశారన్నారు. ఉన్నట్లుండి నవంబర్ మాసం చివర్లో పత్తి కొనుగోలు కేంద్రాలు మూసివేశారన్నారు. ఫలితంగా రైతులు లబో దిబోమంటున్నారన్నారు. రైతులకు సమాచారం ఇవ్వకుండా ఎందుకు కొనుగోలు కేంద్రాలు మూసివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో 50 వేల క్వింటాళ్ల వరకు రైతుల దగ్గర నిలువ ఉన్నాయని ,ప్రారంభంలో తీసిన పత్తి ఇప్పటికీ రైతుల దగ్గర ఉన్నదని, వాటిని కొనుగోలు చేయకపోతే రైతులు అమాంతం నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. కలెక్టర్ రంజిత్ బాష సానుకూలంగా స్పందిస్తూ తక్షణమే మార్కెటింగ్ వారు సిసిఐ వారితో కోఆర్డినేషన్ చేసుకొని తిరిగి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అదేచించారు. సిఐటియు నాయకులు కె.మధు, రైతులు సీతా రాముడు, శివన్న, ఆంజనేయులు షేక్షావలి ఇంకా అనేక మంది రైతులు పాల్గొన్నారు.

హాస్టళ్లకు టీవీలు విరాళం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ బిసి, ఎస్‌సి, ఆనంద నిలయం హాస్టళ్లకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ , జిల్లా జడ్జి జి. కబర్ధి, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి చొరవతోతో బ్యాంకు యజమానులతో మాట్లాడి ఎల్ఇడి టీవీలను విరాళంగా ఇప్పించారు. కలెక్టర్ ఆఫీస్ కాంపౌండ్‌లో ఉన్న హాస్టళ్లను వారు ఈనెల 15న సందర్భించి విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోరిక మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పంజాబ్, యూనియన్, కరూర్ వైశ్యా బ్యాంకుల వారి సహకారంతో మూడు హాస్టళ్లకు మూడు స్మార్ట్ టీవీలు జిల్లా జడ్జి చేతులమీదుగా హాస్టల్స్ వార్డెన్లకు అందజేశారు. ఎస్‌సి. వెల్ఫేర్ ఆఫీసర్ రంగ లక్ష్మి ,అసిస్టెంట్ బి సి వెల్ఫేర్ ఆఫీసర్ ఆంజనేయులు, కరూర్ వైశ్యా బ్యాంకు మేనేజర్ పీరయ్య , యూనియన్ బ్యాంకు మేనేజర్ రజని , పంజాబ్ నేషనల్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు, హాస్టళ్ల వార్డెన్స్ ఆయా సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్లకు టివి అందజేస్తున్న జస్టిస్ కబర్ధి

గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటాం

జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మాట్లాడుతున్న జాయింట్‌కలెక్టర్ డాక్టర్ నవ్య

వంటగ్యాసు సరఫరాలో వినియోగదారుల నుండి ఎంఆర్‌పి కంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య హెచ్చరించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో జాయింట్ కలెక్టర్ సమావేశమయ్యారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ డెలివరీ బాయ్స్ వినియోగదారుల నుండి ఎంఆర్‌పి కంటే అధికంగా డబ్బులు వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే గ్యాస్ ఏజెన్సీలకు నోటీసులు ఇవ్వడమే కాకుండా పెనాల్టీ వేస్తామన్నారు. 15 కిలోమీటర్ల పైగా గ్యాస్ సరఫరా చేస్తే రవాణా చార్జీలు వసూలు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఎస్ఒ రాజా రఘువీర్ , ఆయిల్ కంపెనీస్ జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్టేట్‌కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో చికిత్స పొందుతున్న బాధితులు

స్టేట్ కేన్సర్ ఆస్పత్రిలో ఐపి సేవల ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌లో ఐపి సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా జిటిహెచ్ సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్టేట్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌కు అత్యంత ఖరీదైన వైద్య పరికరాలు వచ్చాయన్నారు. మరికొన్ని త్వరలో రానున్నాయని తెలిపారు. ఇప్పటికే సుమారు రూ.36 కోట్ల విలువైన లీనియర్ యాక్సిలరేటరీ, రూ.7 కోట్ల విలువైన సీటీ సిములేటర్ పరికరాలు చేరుకున్నాయన్నారు. ఇంత ఖరీదైన, అత్యాధునిక పరికరాలు రాష్ట్రంలోని ఏ ఇతర ప్రభుత్వాసుపత్రుల్లోనూ లేవని అన్నారు.అత్యవసర క్యాన్సర్ వైద్య విభాగపు సేవలు, ప్రస్తుతానికి గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి నుంచి జరుగుతాయని అన్నారు. లీనియర్ అక్లరేటర్ పరికరము రోగుల వైద్యసేవల కోసం అందుబాటులోకి రావడానికి ఎఇ ఆర్ బి అనుమతులు లభించాల్సి ఉందన్నారు. స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రిలో ప్రస్తుతానికి అందుబాటులో లేని సేవలు, పరీక్షలు గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలోనే జరుగుతాయి అన్నారు.రోగులకు సేవలు అందించటానికి తాము ముందుంటామని అన్నారు. క్యాన్సర్ సర్జరీలకు దశలవారీగా వైద్య సేవలు ప్రారంభిస్తామన్నారు. త్వరలో ఆసుపత్రికి సిమెన్స్ కంపెనీకి సంబంధించిన అత్యాధునిక సిటిస్కానింగ్ మిషన్ అందుబాటులోకి వస్తుందన్నారు. దీని ద్వారా పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, స్టేట్ క్యాన్సర్ ఇన్సిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సిఎస్‌కె.ప్రకాష్, సి ఎస్ఆర్ఎంఒ డాక్టర్ హేమనలిని, క్యాన్సర్ విభాగపు వైద్యులు, డాక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్, డాక్టర్ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను నాణ్యతగా పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతగా పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం కార్యక్రమంలో సబ్ కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఎలోకి వెళ్లకుండా చూడాలన్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డిఎల్‌పిఒ నూర్జహాన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మజ, ఆర్అండ్‌బి డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, ఉప తహశీల్దార్లు గుండాల నాయక్, వలీ బాష ఉన్నారు.

'ప్రయివేట్'కు అప్పగించొద్దు : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పోస్టు కార్డులు పంపుతున్న కార్మికులు

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించొద్దని సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు, మున్సిపల్ యూనియన్ నాయకులు జై నాగరాజు, కె.ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమంలో భాగంగా స్థానిక పోస్టాఫీస్ వద్ద నినాదాలు చేసి పోస్టు బాక్స్‌లో ఉత్తరాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సమ్మె సందర్భంగా టిడిపి నాయకులు హామీలు ఇచ్చారని, ప్రభుత్వం వచ్చి 9 నెలలు కావస్తున్నా హామీలను నెరవేర్చలేదని తెలిపారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ యూనియన్ నాయకులు బి.మునీంద్ర, సాల్మన్, రంగస్వామి, ఖాజా, ఎస్.సల్మాన్, గోరా బాష, లక్ష్మన్న, మహేష్ నాయుడు, పల్లవి రాజు, జయన్న, ఉరుకుంద, ఆదెన్న, శివపుత్ర పాల్గొన్నారు.

కౌతాళం నుంచే 108 సేవలు

- సర్పంచి పాల్ దినకరన్

ప్రజాశక్తి - కౌతాళం

సర్పంచిని సన్మానిస్తున్న గ్రామస్తులు

మండల ప్రజలకు కౌతాళం గ్రామం నుంచి 108 అంబులెన్స్ సేవలు అందుతాయని సర్పంచి పాల్ దినకరన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. కౌతాళంలో 108 అంబులెన్స్ ఉండాలని మండల సర్వసభ్య సమావేశం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మండల అధ్యక్షులు ఎస్‌కె.అమ్రేష్, వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కోఆప్షన్ సభ్యులు మాబు సాబ్ స్పందించి తక్షణమే ఎమ్మెల్యే బాల నాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. ఎమ్మెల్యే స్పందించి గతంలో ఉరుకుంద గ్రామంలో ఉన్న 108 అంబులెన్స్‌ను కౌతాళం గ్రామంలోనే ఉండే విధంగా చొరవ తీసుకున్నట్లు తెలిపారు. కౌతాళం స్త్రీ, శక్తి భవన్ దగ్గర ఉండేటట్లు అధికారులు చర్యలు తీసుకున్నారని చెప్పారు. కౌతాళంలో ఉండడంతో మండల ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు.

సులేకేరి నుంచి హాల్వికి రోడ్డు వేయండి

- సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య

ప్రజాశక్తి - కౌతాళం

రోడ్డును పరిశీలిస్తున్న నాయకులు

మండలంలోని సులేకేరి గ్రామం నుంచి హాల్వి గ్రామం వరకు రోడ్డు వేయాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే అనారోగ్యానికి గురి కావాల్సిందేనని తెలిపారు. ఇసుక లారీలు అధిక బరువుతో రాకపోకలు కొనసాగించడంతో పూర్తిగా రోడ్డు దెబ్బతిని అధ్వానంగా మారిందన్నారు. సంక్రాంతిలోపు గుంతలు లేకుండా చూస్తామని కూటమి నాయకులు బీరాలు పలకడం కాదని, ఈ రోడ్డుపై ప్రయాణించి చూడాలని నిలదీశారు. రోడ్డును వేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. లేకపోతే ప్రజల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సిపిఎం నాయకులు ఉలిగయ్య పాల్గొన్నారు.

నిలిచిన 'అభివృద్ధి'

- తుప్పు పడుతున్న ప్రజాధనం
- కౌన్సిల్, అధికారుల మధ్య సఖ్యత కరువు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో అభివృద్ధి కుంటుపడింది. కౌన్సిల్, అధికారుల మధ్య సఖ్యత కరువైంది. ప్రజాధనంతో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ అర్ధాంతరంగా నిలిచింది. షాపింగ్ కాంప్లెక్స్ కోసం వాడిన ఇనుము తుప్పు పడుతోందని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

మధ్యలోనే నిలిచిన నిర్మాణం

రాష్ట్రంలో పురాతన మున్సిపాలిటీగా ఆదోనికి పేరు ఉంది. మున్సిపాలిటీ శతాబ్ద కాలం అవుతోంది. అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. ఆదోని అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామని పాలకులు చెబుతూనే ఉన్నారు. అభివృద్ధి చేయాల్సిన పాలకులు ఎవరి పంతాన వారే అన్న రీతిలో వ్యవహరించడంతో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సుమారు రూ.33 కోట్ల వ్యయంతో మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణానికి గతేడాది మార్చిలో శంకుస్థాపన చేశారు. సుమారు రూ.4 కోట్ల వరకు ఖర్చయింది. గ్రౌండ్ లెవెల్ వరకు పని జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పని 20 శాతం కన్నా తక్కువ ఉందన్న కారణం చూపి పనులు నిలిపివేశారు. లబ్ధిదారులు చెల్లించిన మొత్తంతోనే కాంప్లెక్స్ నిర్మాణం జరగాల్సి ఉంది. కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులూ అవసరం లేదు. సాయిల్ టెస్టింగ్ అంతా ఓకే అయినట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో పనులు మొదలయ్యాయని, నాణ్యత లేదని ఎమ్మెల్యే పార్థసారథి అభ్యంతరం చెప్పడంతో కాంట్రాక్టర్ రాజేంద్రప్రసాద్ పనులు నిలిపివేశారు. పనులు ప్రారంభించాలని, సుమారు రూ.3 కోట్లు కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించాలని వైసిపి కౌన్సిలర్లు గతంలో పట్టుబట్టారు. అప్పట్లో ఎమ్మెల్యే సమ్మతించకపోవడంతో పనులకు బ్రేక్ పడింది. ఈ మధ్యలో రాజీ కుదిరిందని, పనులు మొదలు పెట్టేందుకు ఎమ్మెల్యే మద్దతుదారులైన కౌన్సిలర్లు 'కాంప్లెక్స్ నిర్మాణం తీర్మానం ఓకే' అంటూ ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో తెలిపారు. ఎమ్మెల్యే రెండు నాలుకల ధోరణి అవలంభిస్తున్నారని గతనెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో వైసిపి కౌన్సిలర్లు మండిపడ్డారు. ఎమ్మెల్యే పార్థసారథి పక్షాన చేరిన కౌన్సిలర్ల వార్డుల్లో పనులకు మెజార్టీ స్థాయిలో ఉన్న వైసిపి కౌన్సిలర్లు అభ్యంతరం చెబుతూ అజెండాలో తీర్మానం చేయకుండా వ్యతిరేకిస్తున్నారు. వైసిపి కౌన్సిలర్లను ఎదుర్కొనేందుకు ఎమ్మెల్యే పార్థసారథి అధికారులను పురమాయిస్తున్నట్లు చెబుతున్నారు. వారికి సహకరించరాదని ఆదేశించినట్లు కూడా సమాచారం. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం సుమారు 300 దుకాణాలు నిర్మించాల్సి ఉంది. ఫిష్, వెజిటేబుల్, మీట్ దుకాణాలు ప్రత్యేకంగా నిర్మించాల్సి ఉంది. పనులు నిలిచి నెలలు గడుస్తుండడంతో కడ్డీలు తుప్పు పడుతున్నాయని, పంతాలు వదిలి పనులు జరిగేలా అధికారులు శ్రద్ధ చూపాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఆమోదం పొందినా జరగని పనులు

పట్టణంలో సుమారు రూ.2 కోట్ల విలువ గల సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణానికి వైసిపి కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. ఆమోదం తెలిపినా ఇంతవరకు అధికారులు టెండర్లు పిలవలేదు. పనులు ఎందుకు మొదలు పెట్టడం లేదని, అభ్యంతరాలుంటే చెప్పాలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు అధికారులపై మండిపడుతున్నారు. ఎమ్మెల్యే మాటలు విని పని చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్‌తో ఇటీవల వాగ్వాదానికి దిగారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా ఆదోని మున్సిపాలిటీలో ఒక్క అభివృద్ధి పని జరగలేదని చెబుతున్నారు.

కౌన్సిల్‌ను అవమానిస్తున్నారు

ఆదోని మున్సిపాలిటీలో అధికారుల మధ్య కూడా సమన్వయం లోపం కనబడుతోంది. మున్సిపల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారుల మధ్య సమన్వయం లేదని సమాచారం. ఎమ్మెల్యే పార్థసారథి కోటరిగా కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని కూటమి నాయకులు, వైసిపి కౌన్సిలర్లు చెబుతున్నా ఎందుకు టెండర్లు పిలవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పనుల పట్ల నిర్లక్ష్యం వీడి ఆదోని పురోగతి వైపు శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.

అధికారులపై ఫిర్యాదు చేస్తాం

- సిపిఎం సీనియర్ నాయకులు ఈరన్న, ఆదోని

ఎమ్మెల్యే వర్సెస్ వైసిపి కౌన్సిలర్లు అన్న రీతిలో మున్సిపాలిటీలో వ్యవహారం ఉంది. సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా అధికారులు శ్రద్ధ చూపడం లేదు. రాజకీయ నాయకుల మాటలకు తొత్తులుగా మారుతున్నారు. తాగునీటి సమస్య జఠిలమయ్యే ప్రమాదం ఉంది. దీనికోసం ఏ చర్యలు తీసుకున్నారో తెలపడం లేదు. డ్రెయినేజీ నిర్మాణ పనులు ఆగిపోయాయి. అధికారులు కూడా రాజకీయ నాయకుల్లా వ్యవహరిస్తున్నారు. ఇలాగే కొనసాగితే ప్రజలను సమకరించి ఆందోళన చేపడతాం. మారకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం. ఇరువురిని సమన్వయ పరిచి ఆదోని అభివృద్ధి పట్ల అధికారులు దృష్టి సారించాలి.

'జ్ఞాన జ్యోతి'పై అంగన్వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి - నందవరం

నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి కార్యక్రమంపై సోమవారం ఐదోరోజూ శిక్షణ నిర్వహించారు. అంగన్వాడీ సూపర్వైజర్ సుదావతి మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ స్కూల్‌లో బోధించడానికి జ్ఞాన జ్యోతి 120 రోజుల కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలందరికీ విద్యాశాఖ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల కోసం నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యనందించడంపై అవగాహన కల్పించారు. పిల్లల్లో సమగ్రాభివృద్ధికి ప్రీస్కూల్‌లో సరైన విద్యనందించడం, పోషకాహార లోపం లేకుండా చేయాలన్నారు. నాగరాజు, ఉమేష్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

రుణాల కోసం ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - హొళగుంద

బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు హొళగుంద మండల కార్యాలయంలో సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 423 లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా 250 మంది లబ్ధిదారులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఇంటర్వ్యూకు ఎపిజిబి హెబ్బటం బ్యాంక్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్, మండల ప్రత్యేకాధికారి, ఎంపిడిఒ ఇంటర్వ్యూలు నిర్వహించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని ముత్తుకూరు గ్రామంలో నెట్టేకంటయ్య అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఆస్పరి హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. మద్దికెరకు చెందిన నెట్టేకంటయ్య (36) అనే వ్యక్తి ఈనెల 17న ముత్తుకూరులో దేవరకు వచ్చారని తెలిపారు. 19న మధ్యాహ్నం వరకు ఊరిలో ఉన్నారని, తమ్ముడు నెట్టేకంటయ్యతో ఆయన అక్క ఫోన్‌లో మాట్లాడితే గుడి దగ్గరే ఉన్నానని చెప్పారని అన్నారు. అప్పటి నుంచి ఆచూకి లేదన్నారు. సోమవారం ఊరి దగ్గరలో ఓ పొలంలో మృతదేహమై తేలారు. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతునికి భార్య జయలక్ష్మి ఉన్నారు. గత నాలుగు నెలల క్రితం గొడవ పడి భార్య పుట్టింటికి వెళ్లారు. మనస్తాపానికి గురై మద్యం అధికంగా సేవించినట్లు సమాచారం. మృతదేహానికి పంచనామా నిమిత్తం ఆదోని ఆస్పత్రికి తరలించారు. మృతి పట్ల అనుమానాస్పదంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. మృతుని తమ్ముడు ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటుసారా విక్రేతలపై చర్యలు

- ఎక్సైజ్ సిఐ

- నలుగురిపై బైండోవర్ కేసు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో నాటుసారా విక్రేతలపై కఠినంగా వ్యవహరిస్తామని ఎక్సైజ్ ప్రొహిబిషన్ సిఐ సైదుల్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని బోయగేరి, ఎస్సీ కాలనీ, విక్టోరియా పేట, అరుణ్‌జ్యోతి నగర్ ప్రాంతాలకు చెందిన జయలక్ష్మి, మల్లిక, అరికేర ఉమాదేవి, హనుమంతమ్మను తహశీల్దార్ శివరాము ముందు బైండోవర్ చేశామన్నారు. మరోసారి నాటుసారా విక్రయిస్తే రూ.2 లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

నిర్లక్ష్య వైఖరి వీడాలి : లియాఫీ

ఏజెంట్ల సమస్యల పరిష్కారంలో

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎల్ఐసి ఏజెంట్ సమస్యల పరిష్కారంలో యాజమాన్య నిర్లక్ష్య వైఖరి వీడాలని లియాఫీ డివిజనల్ ఉపాధ్యక్షులు ఆంధ్రయ్య, జోనల్ మెంబర్ సోమన్న, బ్రాంచి కార్యదర్శి జయన్న, ఆర్థిక కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. మార్చి 19న ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే చలో ఢిల్లీ గోడపత్రికలను సోమవారం లియాఫీ ఆధ్వర్యంలో బ్రాంచి కార్యాలయం ముందు ఆవిష్కరించి, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాలసీదారులకు బోనస్ రేట్లు పెంచాలని, కనీస ఎండోమెంట్ బీమా రూ.2 లక్షలకు పెంచాలని కోరారు. రూ.లక్ష బీమాను తీసి వేయడం, పాలసీదారులకు బీమా వయో పరిమితి తగ్గించడం వంటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డివిజనల్ నాయకులు హరినాథ్, ప్రెస్ అండ్ పబ్లిసిటీ ఛైర్మన్ సులేమాన్, మల్లికార్జున గౌడ్, దస్తగిరి, ప్రసాద్ స్వామి, ప్రభాకర్, ఇందిరావతమ్మ, వెంకటేష్, భీమన్న, పి.గోపాల్, సుదర్శన్ రావు, మునెయ్య, సిబి.నాగన్న, గోపాల్, ఈ.నాగరాజు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న సభ్యులు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- త్వరలోనే అఖిలపక్షం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్లు వెడల్పు చేయించి.. డివైడర్లు ఏర్పాటు చేయాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణానికి రాకపోకలు సాగించేందుకు ప్రత్యామ్నాయ రోడ్డు లేదన్నారు. ఉన్న రోడ్డులోనే భారీ వాహనాలు రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించబోయి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆదివారం కృష్ణ గుడి వద్ద ఎదురుగా వచ్చే లారీని తప్పించబోయి చిన్నారి ఆదిత్య నారాయణ మృతి చెందగా.. తండ్రి గాయాలు పాలయ్యారని చెప్పారు. రోడ్లు వెడల్పుగా లేకపోవడం, రోడ్డు మధ్య డివైడర్లు లేకపోవడంతో ఎమ్మిగనూరు టర్నింగ్ నుంచి తిక్కస్వామి దర్గా వరకు ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారన్నారు. రోడ్లు వెడల్పు చేస్తామని పాలకులు చెబుతున్నారు తప్ప ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని ప్రజలు ప్రభుత్వాన్ని నిందిస్తున్నారని తెలిపారు. రోజురోజుకు జనాభా పెరుగుతోందని, వాహనాల సంఖ్య కూడా ఎక్కువగా ఉందని చెప్పారు. ఆక్రమణలు తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. త్వరలోనే రాజకీయాలకతీతంగా అఖిలపక్ష రౌండ్ టేబుల్ ఏర్పాటు చేసి ఆదోనిలో రోడ్ల వెడల్పు జరిగేలా అధికారులను భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. 167వ జాతీయ రహదారి ఊరు బయట వెళ్లిందని, అఖిలపక్షం సహకారంతో రోడ్డు వెడల్పునకు చర్యలు తీసుకోవాలని కోరతామని చెప్పారు. ఆదోనిలో ప్రతి దుకాణం వద్ద వాహనాలు అడ్డదిడ్డంగా నిలపడం వల్ల రోడ్లు ఇరుకుగా మారుతున్నాయని తెలిపారు. ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయించాలని కోరారు. కమిషనర్ కృష్ణ మాట్లాడుతూ... ఆక్రమణలు తొలగిస్తున్నామని, రోడ్డు వెడల్పునకు ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉందని తెలిపారు. ఈ విషయాన్ని ఆర్అండ్‌బి అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. మాజీ ఎంపిపి రామ్ భీమ్‌నాయుడు, మాజీ ఎంపిపి భర్త మురళీ, ఇంద్రనగర్ మాజీ కౌన్సిలర్ మారుతి, వడ్డేమాన్ గోపాల్, దేవేంద్ర, రామకృష్ణ, అబ్దుల్, వెంకటరమణ, చిరంజీవి, విజయ్ ఉన్నారు.

కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

లోపించిన పారిశుధ్యం

- గ్రామాల్లో దోమల బెడదతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలం, వివిధ గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. చాలా గ్రామాల్లో కాలువల్లో మురుగుతో దుర్వాసన వెదజల్లుతోంది. వీధుల్లో నెలకు ఒక్కసారి కూడా పారిశుధ్య పనులు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. మురుగు నిండిపోవడంతో దోమల బెడద ఎక్కువైపోయింది. రాత్రి అయ్యిందంటే చాలు దోమల బెడదతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. దోమలతో ప్రజలు, చిన్న పిల్లలు మలేరియా, డెంగీ బారిన పడుతున్నారు. గతంలో గ్రామాల్లో దోమల నియంత్రణకు వీధి వీధినా దోమల మందును స్ప్రే చేసేవారు.

మురుగుమయమైన డ్రెయినేజీ

ప్రస్తుతం అధికారులు ప్రజారోగ్యంపైన, పారిశుధ్యంపైన ఏమీ పట్టినట్లు వ్యవహరిస్తున్నారు. పారిశుధ్య లోపంతో కనకవీడు గ్రామం కంపు కొడుతోంది. గ్రామానికి డంపింగ్ యార్డు దూరంగా ఉండడం వల్ల చెత్తాచెదారం ఊరికి దగ్గరలోనే వేయడం వల్ల, కాలువల్లో విపరీతమైన మురుగు నిండడం వల్ల గ్రామస్తులు కంపు భరించలేక, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. కనకవీడు గ్రామంలో డ్రెయినేజీ సరిగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. మండలంలోని చాలా గ్రామాల్లో పారిశుధ్యంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారులను అడిగినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- సబ్ కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - ఆదోని రూరల్

మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సిపిఎం ప్రతినిధి బృందం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న మాట్లాడారు. మండలంలోని నాగనాథనహళ్లి, హనవాళ్, కుప్పగల్లు, నౌలేకల్ ఎస్ఎస్ ట్యాంకుల్లో పూర్తిస్థాయి నీటిమట్టం నింపాలని కోరారు. కుప్పగల్లు, నౌలేకల్ స్కీమ్ పరిధిలోని గ్రామాలకు అదనపు పైపులైన్ వేయాలని డిమాండ్ చేశారు. కనీసం రెండు రోజులకోసారి తాగునీరు సరఫరా చేయాలని, జలజీవన్ మిషన్ ద్వారా అన్ని గ్రామాలకు ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు సరఫరా చేయాలని తెలిపారు. చిన్న హరివాణం దగ్గర నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకు నుంచి సంతేకుడ్లూరు, పెద్దహరివాణం గ్రామాలకు పైపులైన్ వేయాలని, కుప్పగల్లు ఎస్ఎస్ ట్యాంకు ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు డి.వీరారెడ్డి, రామాంజనేయులు, మండల కమిటీ సభ్యులు అయ్యప్ప, మునిస్వామి, సంతేకుడ్లూరు శాఖ కార్యదర్శి జి.పరమేష్, సభ్యులు నాగరాజు, గర్జప్ప పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కార్మికులను రెగ్యులర్ చేయాలి : ఎఐటియుసి

ప్రజాశక్తి - ఆదోని

దశాబ్ద కాలంగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. నాయకులు వైటి.భీమేష్ అధ్యక్షత వహించారు. అజయ్ బాబు, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు, జిల్లాసమితి సభ్యులు కల్లుబావి రాజు, హుసేని, షేక్షావలీ, వ్యకాస నాయకులు గంగన్న, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు జాన్ బాబు, శాంత, శ్రీనివాసులు, నరసింహులు, గుండ అంజిని, అర్జున్, నాగమ్మ, స్కూల్ స్వీపర్స్(ఆయా) యూనియన్ నాయకులు విజయలక్ష్మి, ఈరమ్మ, మాబాష, పద్మావతి హాజరై మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలని, పర్మినెంట్ చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు.

ఘనంగా బీరప్ప స్వామి పల్లకోత్సవం

పల్లకోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహళ్లి గ్రామంలో వెలసిన శ్రీబీరలింగేశ్వర స్వామి దేవర సందర్భంగా పల్లకోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున ఆలయ పూజారుల ఆధ్వర్యంలో అళ్లింగప్ప, యాతగిరప్ప, వన్నికెరప్ప స్వామి కలిసి పూజలు చేశారు. తుంగభద్ర నది నుంచి పల్లకిలో పారువేట ఉత్సవాలు నిర్వహించారు. గ్రామ పుర వీధుల్లో గూండా డోలు, సన్నాయి, మేళతాళాలు, నృత్యాలు, ఆటపాటలతో దేవాలయం వరకు పల్లకోత్సవం నిర్వహించారు. రాత్రి మలిగే పూజ వైభవంగా సాగింది. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కోనేరు.. హద్దులో ఉంటే మంచిది..!

- టిడిపి నాయకులు బందే నవాజ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

'నేను మాజీ కౌన్సిలర్‌ను. నా చేతిలో లెటర్ ప్యాడ్ ఉంది' అని ఇష్టమొచ్చినట్లు పత్రిక ప్రకటనలు ఇస్తే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని, ప్రకటనలు ఇచ్చేముందు కోనేరు నాగేంద్ర ప్రసాద్ జాగ్రత్తగా ఉండాలని టిడిపి సీనియర్ నాయకులు బందేనవాజ్ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఫిర్యాదుదారుడిగా కోర్టుకు వెళ్లారని, ఆయనను న్యాయవాదులు గౌరవించి బార్ కౌన్సిల్‌లో కూర్చోబెట్టడం తప్పా అని ప్రశ్నించారు. ఆ విషయం మీకు తెలుసా, ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జయనాగేశ్వర రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత న్యాయవాదులు సబ్ కోర్టు ఏర్పాటుకు ఆయనను కలిశారని తెలిపారు. త్వరలో నిధులు కూడా విడుదల చేయించడానికి ఎమ్మెల్యే సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కోనేరు చాలా కేసుల్లో నిందితులుగా ఉన్నారని, ఎన్నో సార్లు కోర్టు మెట్లు ఎక్కారని తెలిపారు. ఆ విషయాన్ని ఎప్పుడూ తమ పార్టీ కార్యకర్తలు, తాము ప్రస్తావించలేదని, ప్రతి చిన్నదానికీ రాద్ధాంతం చేసి పత్రికల్లో ఎక్కాలని అనుకోవడం లేదని చెప్పారు. ప్రజలకు మేలు చేయాలని ఉంటే.. దమ్ము, ధైర్యం ఉంటే ప్రజల మధ్యకు రావాలని హితవు పలికారు. నాలుగు గోడల మధ్య కొంపకు తాళాలు వేసుకుని, భయపడి పిరికిపందలా ప్రెస్ నోట్లు విడుదల చేయడం సిగ్గుచేటన్నారు. పార్టీ నుంచి బహిష్కరించినా ఎన్‌టిఆర్ ఫోటో పెట్టుకుని, ప్రెస్‌నోట్ విడుదల చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇంకోసారి ఎన్‌టిఆర్ ఫోటో పెట్టి స్టేట్‌మెంట్ ఇస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. నిజానిజాలు తెలుసుకొని ప్రెస్ నోట్ విడుదల చేయాలని హితవు పలికారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - నందవరం

చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

నందవరం వడ్డే దస్తగిరి ఇంట్లో ఆదివారం పట్టపగలే చోరీ జరిగింది. చోరీ జరగడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. సోమవారం వడ్డే దస్తగిరి భార్య విజయలక్ష్మి వివరాల మేరకు... తులం బంగారం, రూ.15 వేల నగదు, మొబైల్ దొంగలించారు. విజయలక్ష్మి భర్త మాల ధరించడంతో శ్రీశైలం దర్శనానికి వెళ్లారు. ఆమె అత్త శుభకార్యానికి బళ్లారికి వెళ్లారు. ఆదివారం పిల్లలకు సెలవు కావడంతో విజయలక్ష్మి పిల్లలను వెంట పెట్టుకొని పొలం పనులకు వెళ్లారు. పదో తరగతి చదువుతున్న కుమార్తె ప్రయివేట్ క్లాస్ ఉందని పాఠశాలకు వెళ్లారు. ఆమె వస్తుందని, ఇబ్బంది కలుగకుండా ఇంటి తాళం బయట ఒకచోట భద్రపరిచి వెళ్లారు. ఎవరూ లేని సమయం చూసి తాళం తెరిచి దుండగులు ఇంట్లో పెట్టె తాళం పగులగొట్టి దొంగతనం చేశారు. కుమార్తె ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటి డోర్ తెరిచి, ఇంటి లోపల దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. గతేడాది అప్పులు చేసి ఇల్లు కట్టుకున్నారు. పనికెళ్తేనే పూట గడిచే పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో దొంగతనం జరగడంతో దిగ్భ్రాంతికి గురిచేసింది. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విజయలక్ష్మి తెలిపారు. పోలీసులు ఇంటిని పరిశీలించారు. దర్యాప్తు చేపడతామని పోలీసులు తెలిపారు.

శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకు కూల్చివేత

ప్రజాశక్తి - హాలహర్వి

శిథిలావస్థకు చేరిన ట్యాంకు

మండలంలోని హాలహర్వి, పచర్లపల్లి గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ట్యాంకులను సోమవారం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి వెంకటరమణి ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో కూల్చివేశారు. నీటి వ్యవస్థకు అంతరాయం కలుగకుండా కొత్తవి ప్రారంభిస్తామని వెంకటరమణి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ట్యాంకు కూల్చివేత ప్రశాంతంగా సాగడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇఒఆర్‌డి రామాంజనేయులు పాల్గొన్నారు.

హొళగుందలో సరస్వతి పూజ

ప్రజాశక్తి - హొళగుంద

హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులు సోమవారం సరస్వతి పూజ నిర్వహించారు. విద్యార్థులు మాట్లాడుతూ... ప్రతేడాది పూజ చేయడం ఇక్కడ సంప్రదాయమని తెలిపారు.

పూజలో పాల్గొన్న విద్యార్థులు

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM II ADDITIONAL DISTRICT JUDGE, KURNOOL AT ADONI.
M.V.O.P. 50/2024

Between:-
Boya Somakka and 4 others. ...Petitioner
Vs
B.Eranna and 2 others. ...Respondants

Notice to Respondant No. 1-
R1 B.Eranna S/o B. Hanumanthaiah, Hindu, aged about 45 years, Driver of the Lorry No. AP 16U 4798, resident of H.No. 15/501-21A, Vijayanagar Colony, Adoni.

Whereas the above named Petitioner filed the above case for compensation against you and another and the above case is posted for your appearance on 20-03-2025.

You are hereby directed to appear in person or through your Advocate on 20-03-2025 at 10.30 a.m. before the above said Court to answer the said claim. Failing which the matter will be decided in your absence.

G.C.RANGANNA,
G.RAJESH,
Advocates for Petitioner.

IN THE COURT OF THE CIVIL JUDGE II ADDITIONAL (JUNIOR DIVISION): ADONI
O.S.NO.501/2022.

Between:
Dandi Sreenivasulu. ...Plaintiff
Vs
1. Dandi Savitramma and another. ...Defendants.

SUMMONS TO DEFENDANTS, No.20.
To
D.20. B. Eswarappa, S/o. B.Hanumanthappa, R/o.MIG-219, APHB Colony, Adoni, Kurnool-District.

Whereas the above named Plaintiff filed a suit for partition of the suit Schedule properties in to nine equal halves and declare my 1/9 share in the suit Schedule property. Hence take the summons, if you have got any objection for the above said suit, you may appear before this "Hon'ble Court on 20.03.2025, at 10.30 A.M. either in person or through an Advocate and file your objection. If you fail to do so, the suit will be decided ex-parte.

// BY ORDER OF THE COURT //
V.SRIRAMULU, B.Com., LL.B., (Spl).,
ADVOCATE FOR PLAINTIFF
ADONI
Cell.No.9440244475.

నోటీసు
IN THE COURT OF THE CIVIL JUDGE, JUNIOR DIVISION ADONI
E.P. 152/2018 IN O.S. 171/2016

Between:
K.Mallikarjuna. ...D.H.R
Vs
K.Nalla Reddy. ...J.D.R

To
K.Nalla Reddy,
S/o K.Saralanna
aged about 34 years
R/o H.No.20/181,
Venkanna Bavi Street, Adni.

వాజ్యములో డిక్రీ అస్సైన్ చేయుటకవలన తనకు ట్రాన్సుఫరు చేయబడినదని చెప్పుచు) దానిని అమలు నెరవేర్చడమునకు యీ కోర్టుకు మనవి చేసుకొని వుండేటందున డిక్రీని అమలు నెరవేర్చడమునకు యెందు నిమిత్తము వుత్తర్వులు యివ్వకూడదో మీకు తెలియజేయడమునకు నీవు 2025 వ సం11 ఫిబ్రవరి నెల 25వ తేదిన 10 గంటలకు యీ కోర్టు ఎదుట హాజరు కావలసినదిగా తెలియజేయడమైనది.

టి.ఎల్.వి.సుబ్రమణ్యశర్మ,
అడ్వకేట్,
ఆదోని.